క్లుప్తంగా

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలి



ప్రజలకు సూచనలు తెలియజేస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

ఆత్మకూరు: ప్రజలు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. సోమవారం మండలంలోని నల్లకాలువ గ్రామంలో 104 సంచార వైద్యసేవల కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండటంతో తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, కాచి, చల్లార్చుకుని, వడబోసుకుని తాగాలని సూచించారు. చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని, వేడివేడి ఆహార పదార్థాలు తినాలని చెప్పారు. మధుమేహం, రక్తపోటు వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులను ఉచితంగా సరఫరా చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివ, ఆరోగ్య కార్యకర్తలు భాస్కర్, విశ్వనాథ్, శారదమ్మ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు



సీసీ రోడ్లకు భూమిపూజ చేస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంశెట్టి, అధికారులు

ఆత్మకూరు: పల్లె పండగ–పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంశెట్టి తెలిపారు. సోమవారం మండలంలోని కృష్ణాపురం గ్రామ పంచాయతీలో సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పల్లె పండగ–పంచాయతీ వారోత్సవాలను చేపట్టిందన్నారు. గ్రామస్థాయిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీటి సమస్య, డ్రైయినేజీ కాలువల ఏర్పాటు తదితర సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

విద్యుత్ చార్జీలు రద్దు చేయాలి

నందికొట్కూరు: విద్యుత్ చార్జీలు ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ చార్జీలు పెంచనని చెప్పి అధికారం చేపట్టిన చంద్రబాబు నాయుడు.. ప్రస్తుతం సర్దుబాటు పేరుతో ప్రజలపై భారం మోపడం తగదన్నారు. ఎప్పుడో వాడిన కరెంట్‌కు ఇప్పుడు బిలుల్లు కట్టాల్సిందేనని బలవంతం చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. సమావేశంలో నాయకులు ఫక్కిర్‌సాహెబ్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం

నందికొట్కూరు: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఎమ్మెల్యే జయసూర్య అన్న క్యాంటీన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి ఆయా పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే పేదలకు అన్న క్యాంటీన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ బేబి, వైస్ చైర్మన్ రబ్బానీ, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు ముర్తుజా పాల్గొన్నారు.

కోనేటమ్మపల్లెలో పల్లె పండుగ

ప్రభుత్వం తలపెట్టిన పల్లె పండుగ కార్యక్రమం సోమవారం మండల పరిధిలోని కోనేటమ్మపల్లెలో సర్పంచ్ దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే జయసూర్య, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

మిడుతూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దశరథరామయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కొత్తపల్లి: రైతులు వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి కె.మహేష్ సోమవారం తెలిపారు. వర్షం ఎక్కువైతే పొలాల్లో నీరు నిలువకుండా బయటికి పంపాలని సూచించారు. వీలైనంత వరకు ప్రస్తుతం పైపాటి ఎరువులు వేసుకోకూడదని వివరించారు. పంటకోతలు పూర్తి అయి ఉంటే ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టలతో కప్పుకోవాలన్నారు.

ఆకతాయికి జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన ఆకతాయికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి సోమవారం జైలు శిక్షను ఖరారు చేసినట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు. డేనియల్‌పురానికి చెందిన జరుపతి శివుడు శ్రీనివాస్‌నగర్ రోడ్డులో వెళ్లే మహిళలకు సైగలు చేస్తూ ఈలలు, కేకలు వేస్తూ అసభ్యకరంగా ప్రవర్తించాడు. స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి 5 రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు వెల్లడించారు.

నిలువ నీడ కరువు

- బస్‌షెల్టర్ లేక ప్రయాణికుల అవస్థలు
- హామీలకే పరిమితమైన బస్టాండ్ నిర్మాణం
- ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు
- పట్టించుకోని పాలకులు



బస్టాండ్ సెంటరులో బస్ కోసం వేచి ఉన్న మహిళా ప్రయాణికురాలు

పాములపాడు: ప్రభుత్వాలు మారినా.. పాలకకులు మారినా పాములపాడు మండల ప్రజల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. పేరుకే మండల కేంద్రం గానీ.. కనీసం బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులకు నిలువ నీడ కరువు. ఎన్నికల సమయంలో హామీలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిని బస్టాండ్ నిర్మాణం. ఎండొచ్చినా.. వానొచ్చినా రోడ్డు పక్కన బస్సు కోసం వేచి ఉండక తప్పటం లేదు. కనీసం కూర్చొనేందుకు బల్లలు లేకపోయినా పాలకులెవ్వరూ దృష్టి సారించకపోవడం శోచనీయం.

మండల కేంద్రంలో కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారి గ్రామం మధ్యలో ఉంది. నాలుగు కూడళ్లతో నిర్మాణం లేని బస్టాండ్ ఉంది. మండలంలో 14 గ్రామపంచాయతీలు, 26 మజారా గ్రామాలు, 2011 జనాభా లెక్కల ప్రకారం 40,358 మంది జనాభా ఉన్నారు. పట్టణాలకు వెళ్లేందుకు మండలంలోని ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రానికి రావాల్సిందే. జూపాడుబంగ్లా మండలంలోని తూడిచెర్ల గ్రామస్తులు, కొత్తపల్లి మండల వాసులు కర్నూలుకు పాములపాడు మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు.

నిలువ నీడ కరువు

బస్టాండ్ సెంటరులో ప్రయాణికులు కూర్చొనేందుకు నిలువ నీడ కరువైంది. ఏదైనా ఊరుకెళ్లాలంటే బస్సు వచ్చే వరకు నిల్చొని ఉండాల్సిన పరిస్థితి. వృద్ధులు, గర్భిణులు, బాలింతల పరిస్థితి దయనీయం. కనీసం ఒక రేకుల షెడ్డు కూడా లేకపోవడం సిగ్గుచేటు. ఆర్ అండ్ బీ రహదారికిరువైపులా ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికీ చుట్టుపక్కల వారు నిర్మాణాలు చేపట్టడం, దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో ప్రయాణికులు రోడ్డును ఆనుకొని నిల్చోవాల్సిన దుస్థితి. కూర్చొనేందుకు కనీసం బల్లలు కూడా ఏర్పాటు చేయకపోవడం విశేషం. ఆర్టీసీ చార్జీలు పెరుగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కల్పించలేదు.

మూత్రశాలలు కరువే

వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు వచ్చే మహిళలకు కనీస అవసరాలు కూడా ఇక్కడ లేకపోవడం గమనార్హం. అత్యవసరమనిపిస్తే దగ్గర్లో ఉన్న ఇండ్లను ఆశ్రయించాల్సిన దుస్థితి. ఇంతకీ ఏ కాలంలో మనం జీవిస్తున్నాం అన్న అనుమానాలు తలెత్తక మానదు ఇక్కడి పరిస్థితులు చూస్తుంటే.

ఎన్నికల హామీకి కేరాఫ్ అడ్రస్

మండల కేంద్రంలో బస్‌షెల్టర్ లేకపోవడాన్ని ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల నాయకులకు ఎన్నికల హామీకి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ప్రతిసారి బస్టాండ్ నిర్మాణం లేకపోవడం బాధాకరం. మనం అధికారంలోకి వస్తే తప్పని సరిగా బస్టాండ్ నిర్మాణం చేపడతామని హామీ ఇవ్వడం.. గెలిచిన తరువాత ఆ హామీని పూర్తిగా పక్కన పెట్టడం పరిపాటిగా మారింది. కానీ ప్రతి రాజకీయ పార్టీల సమావేశానికి ఈ కూడలినే అనువైన స్థలం ఎంచుకోవడం సర్వసాధారణంగా మారిపోయింది.

వేల సంఖ్యలో ప్రయాణికులు

ప్రతి రోజుల పాములపాడు నుంచి రాకపోకలు సాగించే వారు వేలల్లోనే ఉన్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్, రెండు ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. విద్యనభ్యసించే విద్యార్థులందరూ ఇతర గ్రామాల నుంచి పాములపాడుకు రావాల్సిందే. వీరితో పాటు ప్రభుత్వ ఉద్యోగులు పట్టణాల నుంచి విధుల నిమిత్తం వస్తున్నారు. వీరిలో మహిళలు కూడా చాలా మందే ఉన్నారు. ప్రయాణికులందరూ ఏదో ఒక గ్రామంలో ఓటరే. అధికారులు, ప్రజా ప్రతినిధులు మండల కేంద్రంలో బస్టాండ్ షెల్టర్ నిర్మాణం గురించి ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



పాములపాడులో బస్టాండ్ సెంటర్

బస్టాండ్‌లో నిలబడిన వారిని చూస్తే బాధేస్తోంది



బస్సు కోసం బస్టాండ్‌లో నిలబడిన వారిని చూస్తే బాధేస్తోంది. మగవారైతే ఏదో ఒక హోటల్లో నిలబడతారు. మహిళలు ఎంతసేపు వాన, ఎండకు నిలబడతారు. సాయంత్రం పూట విద్యార్థులు, ఉద్యోగులతో బస్టాండ్ కిక్కిరిసి ఉంటుంది. మహిళల బాధ వర్ణనాతీతం.

– కోట్ల నాగేశ్వరరెడ్డి, పాములపాడు

సర్వ సభ్యసమావేశంలో చెబుతూనే ఉన్నాం



బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని ప్రతిసారి సర్వసభ్యసమావేశంలో చెబుతూనే ఉన్నాం. కానీ పట్టించుకునే వారే లేరు. రోజుకు వేల సంఖ్యలో పురుషులు, మహిళలు ప్రయాణాలు సాగిస్తున్నారు. వారు పడుతున్న బ్బందులు చెప్పలేనివి. ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే, ఎంపీలు పాములపాడులో బస్టాండ్ నిర్మాణం గురించి ఆలోచించాలి. – భాగ్యమ్మ, సర్పంచు పాములపాడు

గంటల కొద్దీ నిలబడాల్సిందే



కర్నూలుకు వెళ్లేందుకు పాములపాడుకు వస్తే బస్సులు వచ్చేంత వరకు గంటైనా అంతకంటే ఎక్కువైనా సరే నిలబడి ఉండాల్సిందే. మనస్సులో తిట్టుకోవడం తప్పా ఏం చేయలేని పరిస్థితి. బస్టాండ్ అవసరని అందరికీ తెలుసు. మరి ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు.

– శేనారెడ్డి, మిట్టకందాల

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేద్దాం

- ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్



మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజినాయక్

శ్రీశైలం: నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేద్దామని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక అతిథి గృహంలో వాహనదారులకు, డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కారు, ఇతర వాహనాల్లో వెళ్లేవారు సేఫ్టీ బెల్ట్‌ను వినియోగించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని వాహనదారులకు సూచించారు. అనంతరం ఈఓ పెద్దిరాజు, సీఐ ప్రసాద్‌రావు మాట్లాడుతూ సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ చంద్రబాబు, దేవస్థానం సీఎస్ఓ అయ్యన్న పాల్గొన్నారు.

అమ్మవారి తులాభారం



వేలంపాటలో తులాభారాణి లెక్కించుకున్న తలం సురేష్

వెలుగోడు: పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం అమ్మవారి తులాభారంలో ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి శాల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమ్మవారి తులాభారంలో భగవాన్ క్లాత్ స్టోర్‌కు చెందిన శివ మల్లికార్జున, సాయిరాం స్టీల్ షాప్‌కు చెందిన తలం సురేష్‌లు దక్కించుకున్నారు. అనంతరం అమ్మవారు తులాభారాన్ని ఆర్యవైశ్యులు వేలంపాటల్లో పాల్గొనగా రూ.61,000 గూటూరు శ్రీనివాసులు దక్కించుకున్నారు. అమ్మవారి చీరల వేలం పాటల్లో రూ.34,950 లకు మహిళలు దక్కించుకున్నారు. అనంతరం ఆర్యవైశ్యులందరూ వనభోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు లాలం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

సీసీ రోడ్లకు భూమిపూజ

మహానంది: మండల పరిధిలోని గోపవరం, బుక్కాపురం, తిమ్మాపురం గ్రామాల్లో సోమవారం సీసీ రోడ్ల నిర్మాణాలకు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.17 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. గ్రామాల్లోని ప్రతి సందులో సీసీ రోడ్లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బుడ్డా రెడ్డి యశస్విని, మాజీ ఎంపీపీలు చింతం నాగమణి, నాగభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

ఆత్మకూరు: జ్యోతిరావుపూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.రఘురాముడుయాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వరంగల్ జిల్లా సీకేఎం కాలేజీ వద్ద ఉన్న దేశాయిపేటలోని పూలే విగ్రహాన్ని కొంతమంది దుండగులు ధ్వంసం చేశారన్నారు. ఇలాంటి దుశ్చర్యలు పునరావృత్తం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు.

ఏపీఓ హరికృష్ణ

కొత్తపల్లి: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం మండల ఏపీఓగా హరికృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఏపీఓ షేక్ రేష్మ సాధారణ బదిలీలలో భాగంగా బనగానపల్లె మండలానికి వెళ్లారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న హరికృష్ణ కొత్తపల్లి మండలానికి డిప్యుటేషన్‌పై వచ్చారు.



తిమ్మాపురంలో వర్షం కురుస్తున్న దృశ్యం

విడవని వర్షం

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంతోపాటు పరిసర గ్రామాల్లో సోమవారం వేకువజాము నుంచి వర్షపు జల్లులు ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతరాయంగా జల్లులు కురవడంతో ఆలయానికి భక్తుల రద్దీ తగ్గింది. అలాగే మహానందీశ్వరుడి పల్లకీసేవను వర్షం కారణంగా రద్దు చేసినట్లు ఆలయ వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు. మరోవైపు వర్షం మొక్కజొన్నకు తీవ్ర నష్టం కలిగించింది.

మొక్కజొన్న రైతుల ఆందోళన

కొత్తపల్లి: ఎడతెరిపినివ్వకుండా కురుస్తున్న వర్షంతో మొక్కజొన్న రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే చాలామంది రైతులు మొక్కజొన్నలను కోత కోసి కుప్ప నూర్చి దిగుబడులను కళ్లాల్లో ఆరబోసుకున్నారు. సోమవారం చిరుజల్లులు మండల వ్యాప్తగా పడటంతో రైతన్నలు టార్పాలిన్ పట్టలు కప్పి ధాన్యం కాపాడుకునేందుకు తీవ్రంగా శ్రమించారు. తడిస్తే దిగుబడులు రంగు మారి ధరపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు.



శివపురం వద్ద మొక్కజొన్న ధాన్యంపై పట్ట కప్పుతున్న రైతులు

పశువుల సంచారంతో పరేషాన్

- పట్టణంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువుల గుంపులు
- వాహనదారులకు తప్పని ఇక్కట్లు
- రోడ్డుపై తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



పటేల్ సెంటర్‌లో నడిరోడ్డుపై సంచరిస్తున్న ఆవులు

నందికొట్కూరు: పట్టణంలోని రహదారులపై పశువుల సంచారం రోజురోజుకు అధికమవుతోంది. పశువుల యజమానులు వాటి ద్వారా లబ్ధిపొంది వాటిని రోడ్లపైనే వదిలేస్తున్నారు. ప్రధానరహదారులతో పాటు చిన్నాచితక రహదారులపై ఆవులు, కోడెదూడల సంచారంతో వాహనాదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. పశువులు ఒకదానిపై ఒకటి దాడి చేసుకుంటున్న సమయంలో రోడ్లపై ప్రయాణించే వారు భయాందోళనకు గురవుతున్నారు. రోడ్లపై పశువులను దాటుకుని వెళ్లేందుకు సాహసం చేయాల్సి వస్తోంది. రాత్రి వేళ్లలో రోడ్లపై చీకట్లో గేదెలు కనపడకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.

చిరువ్యాపారులకు తీవ్ర నష్టం

ఆవులు, కోడెదూడలు చిరువ్యాపారులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. తినుబండరాల దుకాణాలపై, తోపుడు బండ్ల వ్యాపారాలపై అవి దాడులు చేస్తున్నాయి. రోడ్ల వెంట పండ్లు, కూరగాయాలు అమ్ముకునే వ్యాపారులు వీటి దాడికి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులపై ఆవులు, కోడె దూడల సంచారని నివారించాలని పట్టణ ప్రజలు, వాహనాదారులు కోరుతున్నారు.

ఆచరణకు నోచుకోని అధికారుల హామీలు

పట్టణ పశువుల సంచారాన్ని నిరోధించేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ శాఖ, పోలీసు శాఖ అధికారులు ఇచ్చిన హామీలు ఇప్పటి వరకు నెరవేరలేదు. పశువులు రోడ్లపైకి రాకుండా చూస్తామని తెలిపినా అమలు కాలేదు. ఆ దిశగా అడుగులు పడలేదు. దీనికి పశువుల యజమానుల ఒత్తిళ్ల కారణమనే చర్చ నడుస్తోంది. పశువుల యజమానులు రాజకీయ నాయకుల అండదండలతో పైరవీలు చేసి ఈ అంశాన్ని పక్కన పెట్టించినట్లు చర్చించుకుంటున్నారు.



కర్నూలు–గుంటూరు రహదారిపై ..

రోడ్లకు భూమి పూజ



తాటిపాడులో అంతర్గత రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామంలో సోమవారం నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అంతర్గత రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోపీకృష్ణ, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, సర్పంచ్ వంగాల లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

- **పగిడ్యాల:** మండలంలోని సంకిరేణిపల్లె గ్రామంలో సోమవారం పల్లె పండుగ పంచాయతీ కార్యక్రమాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ పరమేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని వడ్డె బక్కన్న ఇంటి నుంచి తెలుగు నరసింహులు ఇంటి వరకు ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఎంఈఓలు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.
- **మిడుతూరు:** పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా కడుమూరు గ్రామంలో రూ.25 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డుకు ఎంపీడీఓ దశరథరామయ్య భూమి పూజ నిర్వహించారు.
- **పాములపాడు:** మండలంలోని లింగాల గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచు మల్లీశ్వరరెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.
- **వెలుగోడు:** మండల పరిధిలోని మాధవరం గ్రామంలో ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి సీసీ రోడ్లకు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసులు, సర్పంచ్ బ్రహ్మానంద రెడ్డి ల్గొన్నారు.
- **బండి ఆత్మకూరు:** పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఎంపీడీఓ ఎం.దస్తగిరి మండలంలోని పరమటూరు గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.

అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న కమిటీ నిర్వాహకులు

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక గాయత్రీమాత ఆలయంలో సోమవారం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. దేవీ శరన్నవరాత్రోత్సవాల ముగింపు సందర్భంగా కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేపట్టారు. అలాగే అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను ప్రతి రోజు భక్తులకు లక్కీడిప్ ద్వారా అందించారు.

ఉచిత డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: ఏపీ డీఎస్సీ రాయనున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆత్మకూరు డివిజన్ సహాయ సాంఘిక సంక్షేమ అధికారి బట్టు అంకన్న సోమవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత ఉన్న అభ్యర్థులు మూడు నెలలపాటు శిక్షణ పొందేందుకు ఈనెల 21వ తేదీలోగా హెచ్‌టీటీపీ:// జ్ఞానభూమి డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 27న స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందని, హాల్ టికెట్లు 22 నుంచి 25వ తేదీ మధ్య వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వెలుగోడు: మండల వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రధాన పంటలైన వరి, మినుము, మొక్కజొన్న, కూరగాయల పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టి కాపాడుకోవాలని ఏఓ పవన్‌కుమార్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని గుంతకందాల, వెలుగోడు గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పంట పొలాలు ఏఓ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంట కోత అనంతరం మొక్కజొన్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, తుపాను ప్రభావం తగ్గేంత వరకు రైతులెవరు పంటలు కోయరాదన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే సాధ్యమైనంత త్వరగా అధికంగా ఉన్న నీటిని బయటకు వెళ్లేలా చర్యలు తీసుకుని, మొక్కలు త్వరగా కోలుకోవడానికి ఎకరాకు 40 కిలోల యూరియా వేసుకోవాలని సూచించారు.